క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి: మండలంలోని అద్దవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు చీలావారిపల్లి, అద్దవారిపల్లి, గుంటివీరన్నపల్లి, యర్రదొడ్డిపల్లి, కురవపల్లి, కొత్తపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిపై బుక్‌లెట్ అందజేసి, సమస్యలపై ప్రజలను విచారిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు పులికల్లులో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లు పంచాయతీలో గురువారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్యాసెంజర్ రైళ్ల ఆలస్యం

ములకలచెరువు: తిరుపతి – గుంతకల్లు మీదుగా నడిచే రెండు ప్యాసెంజర్ రైళ్లు బుధవారం ఆలస్యంగా నడిచాయి. తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్లే రైలు ఉదయం 10.43 గంటలకు ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 2.43 గంటలు వచ్చింది. కదిరి దేవరపల్లి నుంచి తిరుపతికి నడిచే రైలు 10.49 గంటలకు రావాల్సి వుండగా 12.49 గంటలకు వచ్చింది. రెండు గంటల ఆలస్యం. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చీకలిగుట్టలో నూతనంగా నిర్మించిన మహమ్మారమ్మ అమ్మవారిని బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాంబ, ఉత్తన్న, నగేష్, నరసింహులు, నూర్‌లు పాల్గొన్నారు.

సిరికల్చర్ ఏడీగా రామమోహన్



మదనపల్లె సిటీ: పట్టు పరిశ్రమలశాఖ మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.రామమోహన్ నియమితులయ్యారు. ఈయన గతంలో పట్టుగూళ్ల మార్కెట్ సెక్రటరీగా పని చేశారు. పదోన్నతిపై ఏడీగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ పట్టుపరిశ్రమశాఖను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు.

పట్టుగూళ్ల మార్కెట్ సెక్రటరీగా లక్ష్మిదేవి



మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్ సెక్రటరీగా లక్ష్మిదేవి పదవీబాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో సిరికల్చర్ నాన్ ఫార్మల్ సెక్టార్ విభాగంలో పని చేస్తున్న లక్ష్మిదేవి పదోన్నతిపై మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్‌కు సెక్రటరీగా నియమించారు. అలాగే మదనపల్లె సిరికల్చర్ ఆఫీసర్‌గా చంద్రమోహన్‌రెడ్డి పదవీబాధ్యతలు చేపట్టారు. ఈయన మడకశిర నుంచి మదనపల్లెకు బదిలీ అయ్యారు. తంబళ్లపల్లె సిరికల్చర్ అధికారిగా శ్రీనాథరావు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా నుంచి మదనపల్లెకు బదిలీ అయ్యారు.

ఉదయనిధి స్టాలిన్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న హిందూ సంస్థ నాయకులు

గుర్రంకొండ: సనాతన ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చిన తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై హిందూ సంస్థలు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాయి. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొన్న నాయకులు ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన హిందు ధర్మాన్ని అవహేళనగా మాట్లాడుతున్న ఉదయనిధి స్టాలిన్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందు సంస్థ నాయకులు బీజేపీ శ్రీనివాసులు, రామాంజులు, కిషోర్, భరత్, రమేష్, గణేష్, రంజిత్‌లు పాల్గొన్నారు.

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

- జిల్లాల్లో 45 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు
- హెక్టారుకు రూ. 30 వేల రాయితీ ఇస్తున్న ప్రభుత్వం
- రూ. 1.50 లక్షలు పలుకుతున్న టన్ను డ్రాగన్ ఫ్రూట్స్
- సాగుపట్ల ఆసక్తి చూపుతున్న రైతులు



మల్‌రెడ్డిగారిపల్లెలో డ్రాగన్ ఫ్రూట్ సాగు



డాగన్ ఫ్రూట్ పంట

పీలేరు రూరల్ : పోషకాల గనిగా గుర్తింపు పొందిన డ్రాగన్‌ఫ్రూట్ సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి చాలా మంచిది కావడంతో సూపర్‌ఫ్రూట్‌గా పరిగణిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం ద్వారా మధుమేహం, గుండెజబ్బులు తగ్గుతున్నాయి. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్ సి ఉండడంతో అనేక తీవ్రమైన వ్యాధులను నయం చేయడలో ఉపయోగపడుతోంది. ఒక డ్రాగన్ ఫ్రూట్‌లో 102 కేలరీల శక్తి, 22 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. దీని గింజల్లో ఒమేగా 3, ఒమేగా 9 ఫ్యాటీ యాసిడ్స్ ఉండడంతో గుండె కణాలను బలపరుచటకు ఉపయోగపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుటకు, బరువు నియంత్రణకు ఉపయోగపడుతోంది. మంచి పోషక విలువలు కల్గిన డ్రాగన్ ఫ్రూట్స్‌కు విపరీతమైన గిరాకీ ఉండడంతో రైతులు కూడా ఆ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

విస్తారంగా సాగు

అన్నమయ్య జిల్లాలో 25 మండలాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొత్తం 45 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగులో ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంత నేలలు డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు సంప్రదాయ పంటల సాగుతో నష్టాలు చవిచూసి విసిగి చెందిన రైతులు మంచి గిరాకీ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలో అత్యధికంగా తరిగొండలో రైతు వెంకటేష్ 10 ఎకరాలు, కలికిరి మండలం మర్రికుంటపల్లె పంచాయతీ మల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన రైతు సి. రామకృష్ణారెడ్డి 7.5 ఎకరాలు, గుట్టపాళెంకు చెందిన రైతు జాఫర్‌వలి ఒక ఎకరా, చంద్రావారిపల్లెలో నారదారెడ్డి 3 ఎకరాల్లో, పీలేరు మండలం మర్రిమాకులపల్లెకు చెందిన రైతు గురునాథ 2 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేశారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి...

జిల్లాలో సాగు చేసిన రైతులు డ్రాగన్ ఫ్రూట్స్ బెంగళూరు, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా కూడా మంచి డిమాండ్ ఉంది. తక్కువ సాగు చేసిన వారు స్థానికంగా విక్రయిస్తున్నారు. టన్ను ధర రూ. 1.50 లక్షలు పైగా పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ ఎకరా సాగుకు రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షలు ఖర్చు అవుతోందని, 20 నుంచి 30 సంవత్సరాల వరకు పంట దిగుబడి ఉంటుందని తెలిపారు. ఈ పంట సాగుకు కూలీల ఖర్చు, సస్యరక్షణకు పెద్దగా ఖర్చు ఉండదని, అలాగే చీడపీడల బెడత ఉండదని చెబుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్‌కు మంచి డిమాండ్



డ్రాగన్ ఫ్రూట్స్‌కు మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం 45 హెక్టార్లు మాత్రమే . పక్క రాష్ట్రాలకు కూడా ఎగుమతి జరుగుతోంది. రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. సస్య రక్షణ చర్యలుపై ఉద్యానశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
- రవిచంద్రబాబు, ఉద్యానవనశాఖ అధికారి

సాగుకు ప్రభుత్వ రాయితీ



డ్రాగన్ ఫ్రూట్స్‌కు సాగుకు జాతీయ ఉద్యానవన అభివృద్ధి మిషన్ పథకం రాయితీ లభిస్తోంది. సాగుచేయడానికి మొక్కల కొనుగోలుకు హెక్టారుకు రూ. 30 వేలు చొప్పు రాయితీ కల్పిస్తోంది. రైతులు విలువ ఆధారిత పరిశ్రమలు స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని తీసుకొచ్చింది. - బోదేషావలి, వ్యవసాయ సలహామండలి సభ్యుడు

లాభాలు ఆర్జిస్తున్నాం



గతంలో సాధారణ పంటలతో విసుగు చెంది 7.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేశాను. మొదటి కోతలో 4 టన్నులు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మరో 4 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు మిశ్రమ పంటల సాగుతో లాభాలు ఆర్జిస్తున్నాం. - సి. రామకృష్ణారెడ్డి, రైతు, మల్‌రెడ్డిగారిపల్లె

శ్రమ తక్కువ.. ఫలితం ఎక్కువ



డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడానికి శ్రమ తక్కువ. ఒక సారి కష్టపడి, ఖర్చు పెట్టి సాగు చేస్తే 20 సంవత్సరాల పాటు దిగుబడి ఉంటుంది. దీంతో రైతుకు తక్కువ శ్రమతో అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. నేను రెండు ఎకరాల్లో సాగు చేయగా, మొదటి కోతలో 500 కేజీల దిగుబడి వచ్చింది.
- గురునాథ, రైతు, పీలేరు

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో 9వ తేదీ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాసంఘం అధ్యక్షులు స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ తెలిపారు. సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్, ఎన్ఐయాక్ట్, బ్యాంకు రికవరీ కేసులు రాజీమార్గాన పరిష్కరించడం జరుగుతుందన్నారు. జీవో 417, అక్రమ మద్యం నిల్వ, అమ్మకాలు, 10 లీటర్లలోపు ఉన్న కేసులు ఫైన్ చెల్లించి క్లోజ్ చేసుకోవచ్చున్నారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి రైతులకు చేయూత



కురబలకోటలో చాఫ్ కట్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కురబలకోట: పాడి రైతులకు చేయూతనివ్వడం కోసం సబ్సిడీపై 26 చాఫ్ కట్టర్ల (గడ్డి కత్తిరించే యంత్రాలు)ను బుధవారం ఎంపీపీ బి. దస్తగిరి, ఆర్బీకే చైర్మన్ శివశంకర్‌రెడ్డి కురబలకోటలో రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ యంత్రాలతో గడ్డిని చిన్న ముక్కలుగా కత్తిరించి పాడి ఆవులకు వేయడం వల్ల జీర్ణ శక్తి పెరుగుతుందన్నారు. గడ్డి వృథా కాదన్నారు. రైతులకు సౌలభ్యంగా, సులభంగా ఉంటుందన్నారు. సమయం కూడా ఆదాకాగలదన్నారు. పాలు ఉత్పత్తి, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం పెరుగుతుందన్నారు. అంగళ్లు పశు వైద్యాధికారి సౌజన్య మాట్లాడుతూ రూ.33,970 విలువ కాగల చాఫ్ కట్టర్‌ను ప్రభుత్వం రూ.13,588 సబ్సిడీతో ఇస్తోందన్నారు. రైతులు రూ.20,382 తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కెసీ రామచంద్ర, దళపతి రమణ, శిద్దారెడ్డి, దరణినాథ్ రెడ్డి, రామ్మోహన్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.31 కోట్లతో అభివృద్ధి పనులు

- గడప గడపలో గుర్తించిన సమస్యల పరిష్కారం దిశగా కృషి
- రూ.30ల క్షలతో 19 వవార్డులో మురుగుకాలువల నిర్మాణం
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



19వవార్డులో మురుగుకాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మున్సిపాలిటీలోని 35వార్డుల్లో రూ.31 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని 19వవార్డు పోతులప్పవీధి, అప్పారావుతోట చంద్రా పాలడెయిరీ, అవంతిథియేటర్ లైన్ తదితర ప్రాంతాల్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మురుగుకాలువల నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. కౌన్సిలర్ బి.ఏ.ఖాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజంలు పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏడాదికి పైగా పట్టణంలోని 35వార్డుల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించామన్నారు. వాటి పరిష్కారంలో భాగంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయడమే కాకుండా త్వరితగతిన పనులు జరిగేలా చూడాలని కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణ అభివృద్ధి, మౌలికవసతుల కల్పనలో నిర్లక్ష్యం కనపరిచారన్నారు. నీటిట్యాంకర్లు, ఒప్పంద పారిశుధ్య కార్మికులు, అడ్డగోలుగా భవననిర్మాణాలకు అనుమతుల పేరుతో అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోపిడీకి పాల్పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అభివృద్ధి ధ్యేయంగా, ప్రజలకు అవసరమైన మౌలికవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కరోనాలో రెండేళ్లు అభివృద్ధి పనులు మందకొడిగా సాగినప్పటికీ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలందరూ గమనించి 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ, వినుతాభాయి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ కూల్చివేతపై నిరసన



వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ కూల్చివేతపై నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

మదనపల్లె : పట్టణ శివారులోని అమ్మచెరువుమిట్ట పడమరవైపు బయ్యారెడ్డికాలనీ, గంగమ్మగుడి వెనుక కాలనీవాసులు నిర్మించుకుంటున్న వెంకటేశ్వర ఆలయ ప్రహరీని రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించడంపై స్థానికులు నిరసన తెలిపారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మచెరువుమిట్ట పడమరవైపున బయ్యారెడ్డికాలనీ, గంగమ్మగుడి వెనుక కాలనీలలో సుమారు 1,000 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నామన్నారు. ఈ రెండుకాలనీల ప్రజలు స్థానికంగా వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి అనుమతి కోసం వినతిపత్రం అందజేశామన్నారు. వారు నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో నెలరోజులుగా వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తీసుకువచ్చి, ప్రతిష్ట జరిపి ప్రతిరోజు పూజాకార్యక్రమాలు, శనివారం రోజున భజన, అన్నదానం చేసుకుంటున్నామన్నారు. స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గది చుట్టూరా స్థలంలో ప్రహరీ నిర్మించామన్నారు. దీనిని కట్టేటప్పుడు రెవెన్యూ అధికారులు ఎవరూ ఆక్షేపణ తెలపడం చేయలేదన్నారు. అయితే బుధవారం స్థానిక వీఆర్వో జయరామిరెడ్డి అక్కడకు వచ్చి ఆలయాన్ని జేసీబీతో తొలగిస్తున్నట్లు చెప్పారన్నారు. దీనిపై కాలనీవాసులు తమకు రెండురోజుల గడువు ఇవ్వాలని, ఆలోపు ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి అనుమతులు తెచ్చుకుంటామని చెప్పినా, అలాగేనని చెప్పి, తామందరూ గుడి నుంచి వెళ్లిన తర్వాత జేసీబీతో ప్రహరీని కూల్చివేశారన్నారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు జేసీబీని అడ్డగించి ధర్నాకు దిగారు. ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌చాంద్ వివరణ ఇస్తూ కాలనీవాసులు అనుమతి లేకుండా ప్రభుత్వస్థలంలో ఆలయనిర్మాణానికి పూనుకోవడంతో వీఆర్వో తొలగించినట్లు తెలిపారు.

రోడ్డు సమస్య పరిష్కారం



మనుపల్లిలో రోడ్డు సమస్యపై గ్రామస్తులతో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

రామసముద్రం: మండలంలోని మానేవారిపల్లె పంచాయతీ చీమనపల్లె గ్రామానికి కొంతకాలంగా నెలకొన్న రోడ్డు సమస్యను బుధవారం మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు పరిష్కరించారు. గ్రామానికి రోడ్డు మంజూరు కాగా రోడ్డు వెళ్లే ప్రదేశం రైతుల భూములు కావడంతో అభ్యంతరాలు ఉండేవి. దీంతో గ్రామస్తులు , ప్రజాప్రతినిధులకు సమస్య గురించి విన్నవించారు. దీంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు కొండూరు కృష్ణారెడ్డి , సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడు గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించి రైతులకు నచ్చజెప్పారు. దీంతో రోడ్డుకు కావలసిన రైతుల భూములను సర్వే చేసి గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలప్ప, నాయకులు జయరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి వంద మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఎన్‌సీసీ అధికారి

నిమ్మనపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల (తెలుగు)లో వంద మంది విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణకు ఎంపికైనట్లు సీటీఓ వెంకటగోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు అంజాద్‌అలీఖాన్,ఎన్‌సిసి హవాల్దార్ మస్తాన్ ఆధ్వర్యంలో 8,9 తరగతి విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. మొదటిసారిగా స్థానిక హైస్కూల్‌కు ఎన్‌సీసీ యూనిట్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభిస్తామన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

102 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వాల్మీకిపురం: శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 102 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 31 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ ప్రఫుల్లా తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, శ్రీధర్‌రాయల్, సాగుబడి ఆనంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ఈశ్వరయ్య చిత్రపటానికి నివాళిఅర్పిస్తున్న ఎమ్మెల్యే

పీలేరు : పీలేరు పట్టణంలో తిరుపతి రోడ్డులో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఎంఈవో బండి ఈశ్వరయ్య పది రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం పీలేరుకు చేరుకుని ఈశ్వరయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

ఆది, అంతమే ఆధ్యాత్మికత



అంగళ్లు మల్లయ్య కొండపై చల్లపల్లె, సేతు

కురబలకోట: ఆది, అంతం గురించి చాటి చెప్పేదే ఆధ్యాత్మికత అని బీజేపీ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, మదనపల్లె విజయభారతి హైస్కూల్ నిర్వాహకులు సేతు పేర్కొన్నారు. వారు అంగళ్లు మల్లయ్యకొండను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మల్లయ్య కొండపై ప్రకృతి అందాలకు పరవశం చెందారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆధ్యాతిక మనశ్శాంతిని, ప్రశాంతతను ఇస్తుందన్నారు. ముఖ్యంగా ఆధ్యాత్మికత అంతరంగాన్ని వికసింపజేస్తుందన్నారు. జీవితంలో ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలోనైనా ఆధ్యాత్మిక బాట పట్టక తప్పదన్నారు. ఆధ్యాత్మికత కూడా సంపదేనన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వికసింపచేసుకోవాలన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయన్నారు. ఆధ్యాత్మిక జీవనం సన్మార్గం వైపు నడిపిస్తుందన్నారు. అందం ఆపై ఆహ్లాదరకమైన అంగళ్లు మల్లయ్యకొండ అభివృద్ధికి తమ వంతు చేయూతను అందిస్తామని తెలిపారు.

మొదలైన చవితి సందడి



కంటేవారిపల్లెలో వివిధ రకాల వినాయకులు

కురబలకోట: పల్లె, పట్టణాల్లో వినాయక చవితి సందడి మొదలైంది. వినాయక బొమ్మలు (ప్రతిమలు) ఎంపిక చేయడంలో ముఖ్యంగా యువత ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి బొమ్మలను సంసిద్ధం చేసుకుంటున్నారు. టెర్రకోట బొమ్మలు, కుండలకే కాకుండా వినాయక బొమ్మలకు కూడా పెట్టింది పేరు కంటేవారిపల్లె. ఇక్కడ టెర్రకోట హస్త కళాకారులు 150కి పైగా డిజైన్లలో వివిధ రకాల వినాయక బొమ్మలు చేశారు. రాజస్థాన్, కలకత్తా, జార్ఖండ్ నుంచి హస్త కళాకారులను పిలిపించి ప్రత్యేక ఆకర్షణగా తయారు చేశారు. జాతీయ హస్త కళాకారులు అనసాపురం బాలాజీ ఎప్పటిలా వీటి అమ్మకాలు పెద్ద ఎత్తున గావిస్తున్నారు. 15 ఏళ్లుగా వినాయక బొమ్మల తయారీలో గుర్తింపు తెచ్చుకున్నారు. పెద్దవి రూ.7500 నుంచి రూ.65 వేల వరకు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈసారి కర్ణాటక నుండి ఆర్డర్లు వచ్చిన తెలిపారు. భారీ సైజ షెడ్లు వేసి అందులో వినాయక బొమ్మలు అమ్మకాలు చేస్తున్నారు. ఒకదాని మించి మరొక బొమ్మలా అన్నట్లుగా ఉన్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణ ప్రేమికుల కోసం మట్టి బొమ్మలు కూడా అమ్మకానికి సిద్ధం చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




గోపిక వేషధారణలో చిన్నారి, కృష్ణుడిగా దీక్షణ

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనిలో శ్రీకృష్ణ మందిరంలోను, శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలలో, గీతాపారాయణ మందిరంలో కృష్ణుడిని తమ ఇంటికి ఆహ్వానిస్తూ పిండితో కృష్ణుని పాదాలు వేశారు. రంగురంగుల పుష్పాలతో కృష్ణుని అందంగా అలంకరించి అటుకుల పాయసంతో నైవేద్యం సమర్పించి ఘనంగా పూజలు నిర్వహించారు. కృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కృష్ణుని వద్ద ఏర్పాటు చేసి తులసి మాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లో గీతాపారాయణం కావించారు. అనంతరం చిన్నారుల కృష్ణుని వేషాలు అందరినీ అలరించాయి. చిన్నికృష్ణుడు, గొల్లభామ, గోపికమ్మల వేషాలతో చిన్నారులు అందర్ని అకట్టుకొన్నారు. మహిళలు క్రిష్ణాష్టమి వ్రతాన్ని భక్తి శద్దలతో ఆచరించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో బుధవారం ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తంబళ్లపల్లె పవన్‌కుమార్, విజయలక్ష్మీ దంపతుల కుమార్తె దీక్షణ, కుమారుడు సంజయ్‌కృష్ణ, వెంకటేష్ , రెడ్డెమ్మ దంపతుల కుమారుడు మోక్షిత్‌సాయికి, ప్రసాద్, తిరుమల దంపతుల కుమారుడు రిక్షిత్‌కు కృష్ణుడి వేషధారణ వేశారు. వారు చేసే చిలిపి చేష్టలతో ఆనందించారు.